VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI QEAC No. E334
1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
91(40) 27628194, 27674037
victoria.ashoknagar@gmail.com
://www.victoriaoverseas.com

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 300, పేజీలు - 08
శనివారం, ఏప్రిల్ 18, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

- 25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సీబీఐ కోర్టు ఊరట కల్పించింది. వైఎస్ జగన్ విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే ఇందుకు కొన్ని షరతులు విధించింది. ఏప్రిల్ 20 నుంచి మే 15 మధ్య రెండు వారాల పాటు జగన్ విదేశీ పర్యటనకు వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో కలిసి యూకే, యూరోప్ పర్యటనకు

2లో..

## లోక్‌సభలో వీగిపోయిన
# రాజ్యాంగ సవరణ బిల్లు

- మహిళా రిజర్వేషన్లకు లింకుపెట్టిన నియోజకవర్గాల పెంపు
- ఓటింగ్‌లో పాల్గొన్న మొత్తం 528 మంది సభకు హాజరైన సభ్యులు
- బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండింతల మెజార్టీ సాధించడంలో విఫలం

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ లో వీగిపోయింది. ఈ బిల్లుకు అనుకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. మొత్తం 528 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో 352 ఓట్లు రావాల్సి ఉండగా మూడింట రెండింతల మెజార్టీ సాధించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. దీంతో మిగతా రెండు బిల్లులు నియోజకవర్గాల పునర్విభజన

2లో..



## లోక్‌సభలో రాహుల్
# 'మాయగాడు' వ్యాఖ్యల దుమారం

- బీజేపీ తీవ్ర ఆగ్రహం, క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు శుక్రవారం తీవ్ర గందరగోళానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వివాదాస్పద బిల్లులపై జరిగిన చర్చలో, ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి పరోక్షంగా చేసిన 'మాయగాడు' వ్యాఖ్యలు పార్లమెంటులో పెను దుమారాన్ని రేపాయి. రాహుల్ వ్యాఖ్యలు పార్లమెంటును, 140 కోట్ల మంది ప్రజలను అపహాస్యం చేయడమేనని ఆరోపిస్తూ, ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభలో వాడివేడి వాగ్వాదాలు, నిరసనలు చోటుచేసుకున్నాయి. చర్చలో భాగంగా రాహుల్ గాంధీ తన బాల్యంలోని కొన్ని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు తాను చూసిన ఒక గారడీ ప్రదర్శనను ప్రస్తావిస్తూ, అందులో ఒక ట్రిక్ విఫలమవడంతో ఆ మెజీషియన్ ప్రదర్శన ముగిసిపోయిందని అన్నారు. ఈ బిల్లులు నెగ్గవని బీజేపీకి తెలిసినా, దేశ ఎన్నికల స్వరూపాన్ని మార్చడం, తాను మహిళా పక్షపాతినని చాటుకోవడం అనే రెండు సందేశాలను ప్రధాని ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో "బాలాకోట్ మాయగాడు, డీమానిటైజేషన్

2లో..

# పరువు పోగొట్టుకున్న ఏపీ పార్టీలు

- దక్షిణాదికి వ్యతిరేకంగా వెళ్లి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** మహిళా రిజర్వేషన్ల అమలు, దాంతో పాటు నియోజకవర్గాల పునర్విభజనకు వీలుగా రాజ్యాంగ సవరణ కోసం కేంద్రం తెచ్చిన బిల్లు లోక్ సభలో వీగిపోయింది. లోక్ సభలో మూడింట రెండొంతుల మెజార్టీకి అవసరమైన 352 ఓట్లను సాధించడంలో కేంద్రం విఫలమైంది. కేవలం 298 ఓట్లు మాత్రమే సాధించింది. విపక్షాలు 230 ఓట్లు తెచ్చుకున్నాయి. దీంతో ఈ బిల్లు వీగిపోయినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ బిల్లుకు ఎన్డీయే మిత్రపక్షాల్లో ఉన్న టీడీపీతో పాటు ఏ కూటమిలో లేని వైఎస్సార్సీపీ కూడా మద్దతిచ్చింది. అయితే బిల్లు ఓటమిపాలవ్వడంతో కేంద్రంతో పాటు టీడీపీ, వైసీపికి కూడా షాక్ తప్పలేదు.కేంద్రం ఎప్పుడైతే మహిళా బిల్లు ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా తెచ్చే ప్రయత్నం చేసిందో అప్పుడే దక్షిణాదిలోని ప్రాంతీయ పార్టీలు బీఆర్ఎస్, డీఎంకే, మరికొన్ని పార్టీలు వ్యతిరేకించాయి. కేరళలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటములు, కర్నాటకలో అధికార కాంగ్రెస్, తమిళనాడులో డీఎంకే, మిత్రపక్షాలు, తెలంగాణలో విపక్ష బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ ఇలా పలు పార్టీలు ఈ బిల్లుల్ని వ్యతిరేకించాయి. అయితే ఏపీలో మాత్రం అధికార టీడీపీ, జనసేన, బీజేపీతో పాటు విపక్ష వైఎస్సార్సీపీ కూడా మద్దతిచ్చింది. ఇప్పుడు బిల్లు వీగిపోవడంతో ఆంధ్రా పార్టీలు పరువు పోగొట్టుకున్నట్లయింది.ముందు నుంచీ ఈ బిల్లుల్ని, వాటికి మద్దతిస్తున్న ఏపీ పార్టీల్ని తప్పుబడుతున్న వైఎస్ షర్మిల బిల్లులు వీగిపోయిన అనంతరం స్పందించారు. మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ చేసిన మాయోపాయం పారలేదని, అక్రమ చట్టాలకు అవనిని అడ్డుపెట్టి ఆమోదించాలనే కుతంత్రం నిలబడలేదని ట్వీట్ చేశారు. సాధికారిత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలనే బీజేపీ కుయుక్తులు చెల్లలేదన్నారు. ఎన్డీయే అధర్మంపై, ఇండియా ధర్మయుద్ధం గెలిచిందన్నారు. ప్రజాస్వామ్యం నిలబడిందని,ఇది

2లో..

## 30 లక్షల మెట్రిక్ టన్నుల
# బాయిల్డ్ రైస్ సేకరించండి

### కేంద్రమంత్రి జోషి ప్రహ్లాద్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు తెలంగాణ అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

2లో..



## హైవేలపై ఏఐ కెమెరాలు

- ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే ఆటోమేటిక్‌గా చలాన్లు
- ఎన్‌హెచ్-44లో వాహనదారులపై కెమెరాలతో నిఘా




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సాధారణంగా వాహనదారులు హైవేలు ఎక్కారంటే చాలు రయ్ మంటూ దూసుకెళ్తూ ఉంటారు. గరిష్ఠ వేగం గంటకు 80 కిలోమీటర్లు, 100 కిలోమీటర్లు అని బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని పట్టించుకోకుండా స్పీడు పెంచుతూనే ఉంటారు. ఇక ట్రాఫిక్ పోలీసులు ఉండరు కాబట్టి ఇష్టం వచ్చినట్లు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తూ ఉంటారు. అతి వేగం, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు పెరిగిపోవడంతోపాటు ప్రాణాలు పోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కీలక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే హైవేలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులకు ఆటోమేటిక్‌గా చలాన్లు జారీ చేస్తోంది. దేశంలోనే అతి కీలక నేషనల్ హైవేల్లో ఒకటైన ఎన్‌హెచ్-44 పై డిజిటల్ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసే

2లో..

# కేటీఆర్ పాదయాత్ర ఇప్పుడెందుకు.?

- కేటీఆర్ పాదయాత్రపై కవిత ఆరోపణలు
- పదేళ్లుగా కేటీఆర్ ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదని ఎద్దేవా
- తన టార్గెట్ ఇప్పుడు కాంగ్రెస్ అని వెల్లడి
- హరీష్ రావు కుట్రలు చేస్తున్నారని మండిపాటు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఈనెల 25వ తేదీన కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలపై సంచలన ఆరోపణలు చేశారు. పాదయాత్ర చేస్తానని ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 10 ఏళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని అప్పుడు చేయని పాదయాత్ర ఇప్పుడు ఎందుకు చేస్తానని కేటీఆర్ అంటున్నారని కవిత ప్రశ్నించారు. అధికారంలో ఉన్న 10 ఏళ్లు ఎందుకు ప్రజల్లోకి పోలేదని కేటీఆర్‌ను కవిత నిలదీశారు. ఇక హరీష్ రావు కుట్రలు చేస్తారని కవిత ఆరోపించారు.ఇక తాను పెట్టనున్న కొత్త పార్టీకి మారోజు వీరన్న అనుచరులతో పాటు సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చినట్లు తాజాగా శుక్రవారం రోజున జాగృతి కార్యాలయంలో కవిత తెలిపారు. వారంతా తాజాగా కవితను కలిశారు. తెలంగాణలో అన్ని వర్గాలకు అధికారం రావాలి అనేదే తన ధ్యేయమని వెల్లడించారు. తనకు

2లో..



# సమ్మె విరమిస్తున్నాం..

## - ట్రాన్స్‌కో సీఎండీతో చర్చిస్తాం

- భట్టి విక్రమార్కతో విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీశ్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ట్రాన్స్‌కో సీఎండీతో మా సమస్యల పై చర్చించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్‌లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు.

2లో..

# స్వచ్ఛాంధ్రపై సీఎం చంద్రబాబు సమీక్ష

## - అధికారులకు కీలక ఆదేశాలు

- 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ, శుద్ధి జరగాలని ఆదేశం
- అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం
- హాస్టళ్లలో తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రత్యేక మార్గదర్శకాలు

అమరావతి (ప్రశ్న న్యూస్) 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమ పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని

2లో..



## మీకు మహిళల ఉసురు తగులుతుంది

- విపక్షాలపై అమిత్ షా ఫైర్

2లో..



## రాహుల్ గాంధీ, ఖర్గే ఒక జాతీయ విపత్తు అడ్డుకున్నారు

- భారతదేశ చరిత్రలో సువర్ణదినంగా పేర్కొన్న రేవంత్ రెడ్డి



## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

వెళ్లడానికి అనుమతి ఇవ్వాలంటూ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీబీఐ కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. లక్ష రూపాయల విలువైన పూచీకత్తు సమర్పించటంతో పాటుగా పర్యటన నుంచి తిరిగి వచ్చిన వెంటనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరు కావాలని సీబీఐ కోర్టు స్పష్టం చేసింది.మరోవైపు అక్రమాస్తుల కేసులో వైఎస్ జగన్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసును సీబీఐ కోర్టు విచారిస్తోంది. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ విదేశీ పర్యటనలకు వెళ్లాలంటే సీబీఐ కోర్టు అనుమతి తప్పనిసరి. ఇక జగన్ కుమార్తెలు లండన్‌లో ఉంటున్నారు. వారిని కలిసేందుకు వెళ్లడం కోసం గతంలోనూ వైఎస్ జగన్ యూకే పర్యటనకు వెళ్లారు. అప్పుడు కూడా సీబీఐ కోర్టు ద్వారా అనుమతి తీసుకుని విదేశీ పర్యటనకు వెళ్లారు.అయితే గతంలో ఓసారి జగన్ విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు సరైన కాంటాక్ట్ నంబర్ ఇవ్వలేదని తాము సంప్రదించడానికి ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదని సీబీఐలో కోర్టులో పిటిషన్ వేసింది. వైఎస్ జగన్ ఈమెయిళ్లకు కూడా స్పందించలేదని మరోసారి వైఎస్ జగన్ విదేశీ పర్యటన లకు అనుమతి ఇవ్వవద్దంటూ గతంలో కోరింది. అయితే ఆ తర్వాత వైఎస్ జగన్ విదేశీ పర్యటన పూర్తి చేసుకుని రావటంతో పాటు సీబీఐ పిటిషన్‌కు కౌంటర్ ఇవ్వటంతో అప్పట్లో సీబీఐ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. తాజాగా మరోసారి జగన్ విదేశీ పర్యటనకు అనుమతి కోరగా సీబీఐ కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది.

## లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

బిల్లు-2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు- 2026లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్టు ప్రకటించింది. బిల్లు వీగిపోవడంతో లోక్‌సభ నియోజకవర్గాలను 850కి పెంపునకు బ్రేక్‌లు పడ్డాయి. ఓటింగ్ ముగియడంతో స్పీకర్ సభను శనివారానికి వాయిదా వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రతిపక్షాలపై కిరణ్ రిజిజు విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.రాజ్యాంగ సవరణ బిల్లులు ఆమోదం పొందాలంటే సభకు హాజరై ఓటు వేసిన వారిలో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో 537 మంది సభ్యుల ఉండగా మూడింట రెండు వంతుల మెజారిటీకి 360 సీట్లు అవసరం. 293 మంది సభ్యులున్న అధికార ఎన్డీఏకు 67 సీట్లు తక్కువగా ఉన్నాయి. రాజ్యసభలో మెజారిటీకి కావలసిన కీలక సంఖ్య 163 కాగా, 142 మందికి పైగా సభ్యులున్న ఎన్డీఏకు మెజారిటీ మార్కుకు 21 సీట్లు తక్కువగా ఉన్నాయి. గురువారం ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై చర్చ అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం వివరణ ఇచ్చారు. బిల్లును గంటలోనే మార్పులు సభలో ప్రవేశపెడితే మద్దతు ఇస్తారా? అని ఆయన ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల పెంపునకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీసుకొచ్చింది. ప్రస్తుత 543 స్థానాలు ఉండగా వాటిని 850కి పెంచాలని యోచించారు. కానీ, దక్షిణాది రాష్ట్రాలకు దీని వల్ల అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమైంది. మోదీ ప్రభుత్వం మాత్రం ఎవరికీ అన్యాయం జరగదని, వారికి ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పింది.

## లోక్‌సభలో రాహుల్ 'మాయగాడు' వ్యాఖ్యల దుమారం

మాయగాడు, సిందూర్ మాయగాడు అకస్మాత్తుగా పట్టుబడ్డాడు" అంటూ రాహుల్ పదునైన వ్యాఖ్యలు చేయడంతో బీజేపీ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ సిందూర్'ను గారడీగా అభివర్ణించి రాహుల్ గాంధీ సాయుధ బలగాలను, దేశాన్ని అవమానించారని, ఆయన వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, ఆ వివాదాస్పద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంటరీ భాషను ఉపయోగించాలని రాహుల్‌కు సూచించారు. స్పీకర్ సూచనతో రాహుల్ తన 'మాయగాడు' వ్యాఖ్యలను పక్కనపెట్టినా, ప్రభుత్వంపై దాడిని మాత్రం ఆపలేదు. దేశాన్ని రక్షించే సాయుధ బలగాలు తామేనని బీజేపీ భావిస్తోందని, సాయుధ బలగాల వెనుక పిరికిపందల్లా దాక్కోవడం ఆపాలని ఆయన హితవు పలికారు. అంతకుముందు, తన నానమ్మ ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి వారు డీలిమిటేషన్ వల్ల తలెత్తే ప్రమాదాలను గ్రహించి, దానిని ముందుకు తీసుకెళ్లలేదని రాహుల్ గుర్తుచేశారు.

## పరువు పోగొట్టుకున్న ఏపీ పార్టీలు

భారత దేశ ప్రజల విజయమని పేర్కొన్నారు. బీజేపీ రాజకీయ దురుద్దేశ్యానికి ఇది నిజంగా చరమ గీతమని, మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీజీకి, మత పిచ్చి బీజేపీకి ఇది చెంపపెట్టు అని తెలిపారు.

## 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించండి

**యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి**

తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి వివరించారు. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అందువల్ల యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి చెప్పారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు.

**వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామి**

2014--15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ. 1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు డబ్బు చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గాను పోషకాహార బియ్యాన్ని (ఎఫ్ఆర్కే) పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్ పరిధిలో పంపిణీ చేసేవారని, ఇటీవల దానిని నిలిపివేశారని పేర్కొంటూ వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో జరిగిన సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్, సెక్రటరీ కో-ఆర్డినేషన్ అద్వైత్ సింగ్‌తోపాటు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## హైవేలపై ఏఐ కెమెరాలు




దిశగా ఎన్‌హెచ్ఏఐ అనేక చర్యలు చేపట్టింది. ఈ ఎన్‌హెచ్-44లోని హైదరాబాద్-ఆదిలాబాద్ సెక్షన్‌లో ప్రతి 2 కిలోమీటర్లకు ఒక ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనలో దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా ఇల్చిపూర్, మెదక్ జిల్లా చేగుంట వద్ద ఏర్పాటు చేసిన 2 ఫొటో, 2 వీడియో కెమెరాలు పని చేస్తున్నాయి.ఈ కెమెరాలు వాహనాల వేగంతోపాటు బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ పెట్టుకోకపోవడం కారులో వెళ్లేవారు సీట్ బెల్ట్ ధరించకపోవడం మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలను ఆటోమేటిక్‌గా గుర్తించి వారికి ట్రాఫిక్ చలాన్లను జారీ చేస్తున్నాయి. ఇక ఇల్చిపూర్, చేగుంటల్లో ఉన్న ఫొటో కెమెరాలతో నెలకు సగటున 10 వేల చలాన్లు జారీ చేసినట్లు లెక్కలు ఉన్నాయి. ఇక వీడియో కెమెరాల ద్వారా 15 వేల చలాన్లు జారీ చేయడం అంటే వాటి పనితీరు, కచ్చితత్వానికి నిదర్శనమని ఎన్‌హెచ్ఏఐ అధికారులు వెల్లడిస్తున్నారు.ఇక హైదరాబాద్ నగరంలోనూ భారీగా ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూ.150-200 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రణాళికలు అమలు అయితే హెల్మెట్, ట్రిపుల్ రైడింగ్ చేసేవారిని నడిరోడ్డుపై ఆపాల్సిన అవసరం లేకుండానే ఆటోమేటిక్‌గా కెమెరాలతో వారికి ట్రాఫిక్ చలాన్లు జారీ చేస్తారు.గతంలో భారీగా రోడ్డు ప్రమాదాలు జరిగే మహారాష్ట్రలోని ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ప్రమాదాల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలోనే పైలట్ ప్రాజెక్టు కింద అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ఎన్‌హెచ్-44లోని హైదరాబాద్-ఆదిలాబాద్ సెక్షన్‌ను ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఎంపిక చేశారు.

## కేటీఆర్ పాదయాత్ర ఇప్పుడెందుకు.?

వచ్చే ప్రతీ కష్టాన్ని ఒక పాఠంగా భావిస్తూ సామాజిక తెలంగాణ సాధించే వరకు తన పోరాటం ఆపేది లేదని కవిత స్పష్టం చేశారు. 'సర్వోదయ తెలంగాణ' సాధించడమే తన లక్ష్యమని వెల్లడించారు. ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆమె ఆకాంక్షించారు.తమను ఆపే శక్తి లేదని ఏదైనా శని ఉంటే దాన్ని తొలగించుకోవడం కోసమే తాను కాశీకి వెళ్లి పూజలు చేసినట్లు కవిత వెల్లడించారు. ఈనెల 25వ తేదీన పెట్టనున్న పార్టీ విజయవంతం కావాలని కోరుకున్నట్లు తెలిపారు. కొందరు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని పేర్కొన్న కవిత.. వారి పేర్లు ఇప్పుడే తాను బయటికి వెల్లడించనని తేల్చి చెప్పారు. తెలంగాణ ప్రజల సమస్యలపై ముందుగా తాను బీఆర్ఎస్‌ను టార్గెట్ చేశానని దీంతో తనను ఆ పార్టీ సస్పెండ్ చేసినట్లు కవిత తెలిపారు.అయితే ప్రజల సమస్యలను తీర్చాల్సింది అధికార పార్టీ అని అందుకే కాంగ్రెస్ పార్టీని తాను లక్ష్యంగా చేసుకుని పోరాటం చేస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. అయితే సమస్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా తాను గళం విప్పుతానని తెలిపారు. పరిగి రైతుల దీక్షకు మద్దతిచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి హరీష్ రావు హౌస్ అరెస్ట్ అయినట్లు ఆరోపించారు. హరీష్ రావు ఫోన్ చేస్తేనే పోలీసులు వచ్చి హౌస్ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పరిగి వెళ్లి తాము రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని ఖమ్మం జిల్లా వెలుగుమట్ల పోరాటం తరహాలోనే పరిగిలోనూ అదే పోరాటం చేసినట్లు వెల్లడించారు.

## స్వచ్ఛాంధ్రపై సీఎం చంద్రబాబు సమీక్ష

అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల్లో అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్లను నిర్మించాలని సీఎం సూచించారు. ఇంటింటికీ వెళ్లి 100 శాతం చెత్త సేకరణ జరగాలని, సేకరించిన చెత్తను శాస్త్రీయంగా శుద్ధి చేసే ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్దేశించారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో తడి, పొడి చెత్త నిర్వహణ, పరిశుభ్రమైన వంటగదుల నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు, నెట్ జీరో సాధన, పచ్చదనం పెంపు వంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి. నారాయణ, పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ కమిషనర్ సంపత్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సమ్మె విరమిస్తున్నాం..

**ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలి**

సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది...వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్‌కో సీఎండీ చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మీకు మహిళల ఉసురు తగులుతుంది

**- విపక్షాలపై అమిత్ షా ఫైర్**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు. ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ, ఖర్గే ఒక జాతీయ విపత్తు అడ్డుకున్నారు

**- భారతదేశ చరిత్రలో సువర్ణదినంగా పేర్కొన్న రేవంత్ రెడ్డి**

న్యూఢిల్లీ లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ (డీలిమిటేషన్) బిల్లు వీగిపోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది భారత చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే చారిత్రక రోజని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమై ఓ జాతీయ విపత్తును నివారించాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ బిల్లులను 'నల్ల బిల్లులు'గా అభివర్ణించిన ఆయన, వాటిని ఓడించేందుకు ఐక్యంగా నిలిచిన మిత్రపక్షాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ థాక్రే, లాలూ ప్రసాద్ యాదవ్, హేమంత్ సోరెన్, ఫరూక్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, అరవింద్ కేజ్రీవాల్, కమ్యూనిస్టు పార్టీల నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. విపత్కర పరిస్థితుల్లో విపక్షాలన్నీ కలిసికట్టుగా నిలబడ్డాయని కొనియాడారు. చివరగా 'జై హింద్' అంటూ తన పోస్టును ముగించారు.

## చంద్రాకారం మోడల్ గురించి అవగహానా

**పత్తికొండ** పత్తికొండ మండలంలో చిన్నహుల్తి మరియు పత్తికొండ గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ఏ. వెంకట రాముడు గారు ప్రకృతి వ్యవసాయంలో పాటించే పద్ధతుల గురించి రైతులకి తెలియజేయడం జరిగినది. ఇందులో భాగంగా మహానంది అనే రైతు రెండున్నర ఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయం కింద చేపట్టే పద్ధతులైనా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్, ఏటీఎం మోడల్ మరియు అర్ధ చంద్రాకారం మోడలను చేయించడం జరిగినది.తొలకరి చినుకులకు ముందు సూర్యుని ఉష్ణోగ్రత బారి నుండి భూమిని కాపాడే విధంగా పైన తెలిపిన మోడల్ లను ఉపయోగించడం వలన భూమికి రక్షణ కవచంగా పనిచేస్తు భూసారం పెంచుతుంది

అయితే మహానంది రైతు పొలంలో నూనె జాతి , పప్పు జాతి, గడ్డి జాతి, తీగజాతి ఆకుకూరలు కూరగాయలు వంటి 32 రకాల విత్తనాలను 15 కేజీలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఒకేసారి పొలంలో వెదజల్లేరు ఈ విధంగా రైతులు పీఎండీఎస్ వేసుకోవడం వల్ల భూమిలో సహజ సిద్ధమైన నత్రజనిని కర్బన పదార్థం ఎక్కువగా ఉండే విధంగా తయారు చేసుకోవచ్చును మరియు భూమి సారవంతము పెరుగుతుంది ఈ పద్ధతులు పాటించడం వల్ల ఎరువుల వాడకం అవసరం లేకుండానే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చును ముంచుకొస్తున్న ఎల్ నినో ప్రభావం నుండి పీఎండిఎస్ విధానం సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా భూమిలో నీటి శాతం ఆవిరి కాకుండా రక్షణ కవచంగా ఉండి కలుపును అరికడుతుంది రైతులంతా ఈ పీఎండిఎస్ విధానాన్ని పాటించాలని తెలియచేయడం జరిగినది ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులు మరియు సిబ్బంది విధానాన్ని రైతులకు అందరికీ పరిచయం చేయడం జరుగుతుందని అలాగే ఎవరైనా రైతులు ఆసక్తి కలవారు సమీప గ్రామంలోని రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని కలిసి సంప్రదిస్తే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా రైతులకు వారి పొలంలోని చేసుకునే విధంగా పద్ధతులను తెలియజేసే విధంగా రైతులకు అందరూ అందుబాటులో ఉంటున్నారు కావున కావలసినవారు సంప్రదించగలరు ఈ యొక్క పద్ధతులు పాటించడం వలన పొలంలో నీటి ఎదుటి తట్టుకోవడానికి పంటలు సమృద్ధిగా పండే విధంగా ఎరువుల వాడకం తగ్గించి మరియు రైతులకి పెట్టుబడి తక్కువగా అవుతూ మంచి దిగుబడులు పెంచుకోవచ్చును ఈ విధానాలు పాటించడం వలన భూమిలోని సూక్ష్మజీవులను కాపాడుకొని నేలను సారవంతం చేసుకుని ఆరోగ్యకరమైన పంటలను పండించుకోవచ్చును ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎంకే శ్రీనాథ్ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లికార్జున ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగినది

## బ్లాక్ స్పాట్ గుర్తింపు.. హెల్మెట్ లేనివారిపై యాక్షన్

**- కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రభుత్వం అమలు చేస్తుంది. ప్రతి వారం ఒక థీమ్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తు మెరుగైన సేవలు అందించేలా జరుగుతుందని కలెక్టర్ మను చౌదరి అన్నారు. రవాణా శాఖ పోలీస్ సమన్వయంతో అరైవ్ అలైవ్ కార్యక్రమం ఈ వారం కొనసాగుతుంది. రోడ్డు భద్రత రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారిస్తు మరణాల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఓవర్ స్పీడ్ ,డ్రంక్ అండ్ డ్రైవ్, సీటు బెల్ట్,హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాదాలు అందికంగా జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి ప్రజలకు రోడ్డు భద్రతా పై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం. బ్లాక్ స్పాట్ గుర్తిస్తున్నాం. హెల్మెట్ లేనివారిపై యాక్షన్ తీసుకుంటున్నామని అన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలి

**హైదరాబాద్** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ పోరాటాలు కొనసాగుతాయని తెలంగాణ ఉద్యోగ , ఉపాధ్యాయ , పెన్షనర్ల జేఏసీ ఛైర్మెన్ లచ్చిరెడ్డి అన్నారు. ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను, న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నాంపల్లి లోని హైదరాబాద్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం లచ్చిరెడ్డి మాట్లాడుతూ... తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు దశల వారిగా కార్యక్రమాలను చేపట్టామన్నారు. పెన్షనర్స్ కు నగదు రహిత చికిత్స , సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ ను అమలు చేయాలని , పెండింగ్ బిల్లులు డీఏల విడుదల తదితర సమస్యల పరిష్కారం కోసం జేఏసీ పని చేస్తుందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ , 61 ఏళ్ళు నిండిన విఆర్ఏ వారసులకు ఉద్యోగులు కల్పించాలని కోరారు. జూన్ 2 వ తేదీ వరకు పీఆర్సీ అమలు చేయాలని లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు.

## మాజీ సర్పంచ్ బాలస్వామి మృతి

## పలు నేతల సంతాపం



**బ్రహ్మంగారిమఠం** బ్రహ్మంగారిమఠం మండల మద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సోమిరెడ్డి శ్రీపల్లె మాజీ సర్పంచ్, మండల కోఆప్షన్ సభ్యులు సోమిరెడ్డిపల్లె బాలస్వామి గురువారం మృతి చెందారు ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంగా ఉండి మంచానికే పరిమితమై ఉన్నారు ఈయన మరణ వార్త తెలుసుకొని ఆయన భౌతిక కాయానికి మండల,ప్రజా పరిషత్ అధ్యక్షులు చిలేకాం పల్లె వీరనారాయణరెడ్డి, మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి,పోచంరెడ్డి, పాలరామిరెడ్డి,వైయస్సార్సీపి నాయకుడు సిద్ధారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్ సాంబశివరెడ్డి, వైసీపీ నేత ఎత్తపు వెంకటసుబ్బారెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని తెలియజేశారు. అనంతరం బాలస్వామి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## వైస్సార్సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా

## బోగిరెడ్డి సిద్దారెడ్డి

**బ్రహ్మంగారిమఠం** బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డి పల్లి పంచాయితీ మద్దిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన భోగి రెడ్డి బాల సిద్ధారెడ్డి (ఏఅః)గారిని నియమించిన వైస్సార్సీపీ పార్టీ అధిష్టానం. ఈ సందర్భంగా సిద్దారెడ్డి మాట్లాడుతూ నన్ను గుర్తించి పార్టీ అధిష్టానం ఈ పదవిని ఇచ్చినందుకు నేను మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి,ఎం పి అవినాష్ రెడ్డి కి, మాజీ ఎమ్మెల్యే రఘురామి రెడ్డి కి, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు పోచమ రెడ్డి రవీంద్రానాథ్ రెడ్డి కి, జిల్లా పరిషత్ చైర్మెన్ ముత్యాల రామగోవింద రెడ్డి,ధన్యవాదాలు అని వైయస్సార్సీపి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడతానని అన్నారు

## కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్లపై కమిటీ

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు
- కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీ
- మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తి చేయాలన్న ప్రభుత్వం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుండగా బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఖండిస్తోంది. ఈ క్రమంలోనే గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని పలు బ్యారేజీలు కుంగుబాటుకు గురి కావడంతో ఈ విమర్శలు తీవ్రం అయ్యాయి. మరోవైపు ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి అక్కడి పరిస్థితిని స్వయంగా సమీక్షించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దెబ్బతిన్న మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను పునరుద్ధరించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బ్యారేజీల మరమ్మతు పనులతోపాటు శాశ్వతంగా కనుగొనాల్సిన పరిష్కారాల కోసం కీలక కసరత్తు మొదలుపెట్టింది.ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పనుల సమన్వయం, పర్యవేక్షణ కోసం ఒక ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల, టన్నెలింగ్ నిపుణుడైన రిటైర్డ్ ఆర్మీ అధికారి కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ 3 బ్యారేజీల పునరుద్ధరణ పనులను సమన్వయం చేసుకోవడం, అనుకున్న సమయానికి కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి ఉపయోగంలోకి తీసుకువచ్చే పనులను ఈ కమిటీ చూసుకోనుంది.వారానికి 2 సార్లు సమావేశం కానున్న ఈ కమిటీ పనుల పురోగతిని సమీక్షించనుంది. అదే సమయంలో నిత్యం జరిగే పనులపై రోజువారీ రిపోర్టులు కూడా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇక వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ బ్యారేజీలకు సంబంధించి కీలక పరీక్షలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. బ్యారేజీల పునాదుల ఎంత పటిష్ఠంగా ఉన్నాయో తెలుసుకునేందుకు మే 30వ తేదీ లోపు జియో టెక్నికల్, జియో ఫిజికల్ టెస్ట్‌లు పూర్తి చేయాలని ఆదేశించింది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచనలతోపాటు అనుమతుల మేరకు ఈ పనులు చేయనున్నారు. మొదట అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తి స్థాయిలో రెడీ చేసి ఆ తర్వాత పాక్షికంగా అయినా మేడిగడ్డ బ్యారేజీని కూడా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# రోడ్డు నిబంధనలపై చైతన్యం అవసరం
# మానవ తప్పిదాలే ప్రమాదాలకు కారణం

**రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమ లక్ష్యాలు ప్రజల్లోకి విస్తృతంగా చేరాలని ఆకాంక్షించారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రోడ్డు భద్రత కమిటీల ద్వారా ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించే వారిని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ఒక ప్రమాదంలో కుటుంబ పెద్ద మృతి చెందితే ఆ కుటుంబం తీవ్రంగా దెబ్బతింటుందని పేర్కొన్నారు.
ముఖ్యంగా ఓవర్టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని, ఎదుటివారు తప్పు చేసినా ఫలితాన్ని మనమే అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. మానవ తప్పిదాలే ఎక్కువగా ప్రమాదాలకు కారణమవుతున్నాయని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వారం రోజుల పాటు విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ట్రైనీ ఐపీఎస్ అయేషా ఫాతిమా, ఏసిపి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశంలో
## పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



అమరావతి (ప్రశ్న న్యూస్) వెలగపూడిలోని శాసనసభ సచివాలయం కమిటీ హాల్-1లో పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పి.యు.సి సభ్యులైన మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలపై ఈ సమావేశంలో చర్చించారు. ఏపీ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, ఏపీ ఆరోగ్య వైద్య గృహనిర్మాణ మౌలిక సదుపాయాల సంస్థ, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ లిమిటెడ్, ఏపీ రాష్ట్ర సాగునీటి అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల ఆస్తి నిర్వహణ సంస్థ లిమిటెడ్ సంస్థల గత ఐదేళ్ల వార్షిక నివేదికలు, సాధారణ కార్యకలాపాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సహచర పి.యు.సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి అభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం:ఎమ్మెల్యే గౌతు శిరీష

**- ఆస్తి కోసం తల్లిని బయటకు గెంటేసిన జగన్ రెడ్డి..**
**మహిళా పక్షపాతి ఎలా అవుతారు**



మంగళగిరి (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రాత్మక బిల్లు వస్తుంటే.. కులమతాలకు అతీతంగా మహిళలందరూ పండగ చేసుకుంటున్న తరుణమిదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆంధ్రరాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి , ఆయన సైకో బ్యాచ్ చేస్తున్న విమర్శలు చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావట్లేదని విమర్శించారు. ఇప్పటి వరకు వీరిని విలన్లు అనుకున్నాం.. కానీ వీరు ఉత్త "జోకర్లు" అని కూడా ఈ మధ్య కాలంలో నిరూపించుకుంటున్నారని ధ్వజమెత్తారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాజీ మంత్రి విడుదల రజిని ప్రెస్ మీట్ పెట్టి తెలుగుదేశం వస్తే అకృత్యాలు జరుగుతున్నాయని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. మేడం. ఒక్కసారి గూగుల్ ఓపెన్ చేసి ఎన్ సి ఆర్ బి 2023 నివేదిక చూడండి. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో నేరాలు ఏ స్థాయిలో పీక్ స్టేజ్ కి వెళ్ళాయో ఆ నివేదిక చెంపదెబ్బ కొట్టినట్లు చెబుతోంది. దక్షిణాదిలో మనకంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడును దాటి ఏపీని నేరాల్లో నంబర్ వన్ చేసిన ఘనత మీ జగన్ రెడ్డిది కాదా? "దళితులు నా సోదరీసోదరులు" అని జగన్ రెడ్డి ఆస్కార్ స్థాయి నటన ప్రదర్శిస్తారు. కానీ, దేశంలోనే దళితులపై నేరాలు, అకృత్యాలు జరగడంలో మన ఆంధ్రప్రదేశ్ టాప్ పొజిషన్ లో ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో జగన్ హయాం దారుణవైఖరి ప్రదర్శించారు. రజిని మీ హయాంలో జరిగిన నేరాల చిట్టా తీస్తే మీ ముఖం ఎక్కడ పెట్టుకుంటారో మీరే ఆలోచించుకోవాలి. మీడియా ముందుకు వచ్చి మొసలి కన్నీరు కార్చే ఈ వైసీపీ నేతల అబద్ధాలను నమ్మకండి. మా దగ్గర ప్రతి నిందకు సాక్ష్యం ఉంది, ప్రతి అరాచకానికి ఆధారాలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ మహిళల ఆత్మగౌరవం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కట్టుబడి ఉంటుందని తెలిపారు.

# మహిళా సాధికారతకు 'తెలుగుదేశం' కట్టుబడి ఉంది: ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

### ఢిల్లీలో ఏపీ మహిళా ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమావేశం





న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్) మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పార్టీ మహిళా ప్రజాప్రతినిధులతో ఎంపీ కేశినేని చిన్ని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని వివరించారు. మహిళలు రాజకీయంగా ఎదిగేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షల మేరకు 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేయడంలో తమ వంతు కృషి చేస్తామని కేశినేని చిన్ని పునరుద్ఘాటించారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్రను గుర్తించి, వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన పలువురు మహిళా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్య వైకరితో కొన ఊపిరితో
# కొట్టుమిట్టాడుతున్న ఉద్యోగుల జీవితాలు

- డిఏ ల ఊసేలేదు పెండింగ్ బిల్లుల జాడే లేదు
- ఉద్యోగుల ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైకరి
- కల్లబొల్లి మాటలతో కాలాయాపన
- మూడేళ్లు కావస్తున్నా పీఆర్సీ కమిటీ రిపోర్ట్ ఏమైంది.
- సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం







అమీర్ పేట్ (ప్రశ్న న్యూస్) ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి దురదృష్టకరమని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్, స్టేట్ టీబి ట్రైనింగ్ సెంటర్ బ్రాంచ్ (ఎస్.టి.డి.సి-డిటిసి) అధ్యక్షుడు రవికుమార్ సంతోజు అన్యారు. ఉద్యోగుల దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల సాధనలో భాగంగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, కల్లబొల్లి మాటలతో కాలయాపన చేయడం తప్ప ఓరగబెట్టిదేమి లేదని విమర్శించారు. ముఖ్యంగా రెండవ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి మూడేళ్లు కావస్తున్నా నేటి వరకు నివేదిక అతీగతీ లేదని, ఐదు విడతల డి.ఏ లు పెండింగ్ లో ఉన్నాయని దీంతో ప్రతి ఉద్యోగి సగటున ప్రతి నెలకు 10 నుండి 20 వేలు నష్టపోతున్నారని తెలిపారు. ఉద్యోగులు తమ సర్వీస్ కాలంలో జమ చేసుకున్న డబ్బులు సైతం అత్యవసరాల సమయంలో చేతికి అందక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తంచేశారు. పేద బడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేల శ్రమిస్తు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న ఉద్యోగులను సమస్యల సుడిగుండంలోకి నెట్టివేయడం ఎంత వరక సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి దాదాపు మూడేళ్లుగా నాంచుతున్న పీఆర్సీ రిపోర్టును తక్షణమే విడుదల చేసి వెంటనే అమలు చేయాలని, పేరుకుపోయిన ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. నవీన్ కుమార్, డాక్టర్. దీప్తి, డిఎస్ఓ. ప్రకాష్ రెడ్డి, ఫారుక్, మహబూబ్ అలీ, ఖాదర్, యాసిన్, శ్రవంతి, ఎస్తేర్ రాణి, జుబేదా బేగం, గంగాధర్, కిషన్, అయూబ్ అలీ, అక్బరీ బేగం తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కారించుటలో ప్రభుత్వం విఫలం

### టిజిఎంఈయు వర్కింగ్ ప్రెసిడెంట్: వేణు కుమార్




ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కారించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహకాద్యక్షులు వేణుకుమార్ అరోపించారు. ఏఐటియూసీ అనుబంధ సంస్థ అయిన తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ఈఎస్ఐ (నాచారం) ఆసుపత్రిలో శుక్రవారం నాడు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గోన్న ఆయన మాట్లాడుతు ఉద్యోగులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి శోచనీయమని పేర్కొన్నారు. కాలయాపన చేయడం తప్ప సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ముఖ్యంగా రెండవ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి మూడేళ్లు కావస్తున్నా నేటికి అతీగతీ లేదని, వెంటనే పీఆర్సీ కమిటీ నివేదికను విడుదల చేసి అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పేరుకుపోయిన ఉద్యోగుల బకాయిలు ఒకే విడతలో తక్షణమే చెల్లించాలని, వైద్య శాఖలో గుర్తింపు పొందిన యూనియన్ నాయకుల అక్రమ బదిలీలు రద్దు చేసి, వారి హక్కులు కాపాడాలని, వైద్య విధాన పరిషత్ లో మినిమం టైం స్కేల్ ఉద్యోగుల సర్వీసులు రెగ్యులర్ చేస్తు, ఈ.ఎస్.ఐ. ఉద్యోగులకు 126 జి ఓ ను సవరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఈ నిరసన కార్యక్రమంలో ఈఎస్ఐ ఆస్పత్రికి చెందిన ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు .

# నిర్దేశిత గడువులో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

**- టిటిడి జేఈవో డా. ఎ. శరత్**



తిరుపతి(ప్రశ్న న్యూస్) నిర్మాణంలో ఉన్న శ్రీ పద్మావతీ చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నూతన భవన నిర్మాణాన్ని నిర్ణయించిన గడువులో పూర్తి చేయాలని టిటిడి జేఈవో (వైద్యం ఐ విద్య) డా. ఎ. శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, ప్రతి ఫ్లోర్‌లో ఒక గదిని మోడల్ యూనిట్‌గా అభివృద్ధి చేసి, ఆ గదిలో ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ, మెడికల్ ఎక్విప్‌మెంట్ తదితర సదుపాయాలను సమగ్ర ప్రణాళికతో ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని గదుల్లో ఆమోదిత లేఅవుట్‌కు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. పెండింగ్ పనులను సంబంధిత విభాగాలు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి గదిలో రోగి సేవలకు అవసరమైన మెడికల్ మరియు సపోర్ట్ సదుపాయాలు నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే ప్రముఖ ఆసుపత్రులలో అమలులో ఉన్న ఉత్తమ పద్ధతులపై నివేదికలు సేకరించి అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఈ టి.వి. సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ఈలు మనోహరం, వేంకటేశ్వర్లు, డిఈ సరస్వతి, డిప్యూటీ ఈఈ హర్షవర్ధన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు .

## అస్సాం సి ఎం హేమంత బిశ్వ శర్మ పై ...
## ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి...



మంథని ( ప్రశ్న న్యూస్)మంథని నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్కపాక సంపత్ కుమార్ నిన్నటి రోజున అస్సాం సి ఎం హేమంత్ బిశ్వ శర్మ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే పైన కుల వివక్షమైన ఆరోపణలు చేసి మతోన్మాద శక్తులను ప్రేరేపించి ఒక దళిత నాయకుడైన మల్లికార్జున కార్గే మీద అనుచిత ఆరోపణలు చేసినందుకు గాను వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయవలసినదిగా మంథని పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడం జరిగినది. తెలంగాణలోని దళితులు నీకు తగిన బుద్ధి చెబుతారని అస్సాం ముఖ్యమంత్రి భీష్మ శర్మ మీ బుద్ధి మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని ఎస్సీ ఎస్టీలపై ఇలా మాట్లాడడం సమాజం సిగ్గుతో సిగ్గుతో తలవంచుకునే విధంగా మాట్లాడడం సిగ్గుచేటని మేధావులు రాజకీయ విశ్లేషకులు తదితరులు బాధపడుతున్నారు ఒక పార్లమెంటులో ఇలా మాట్లాడడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని అది ఒక ఎస్సి పై ఇలా మాట్లాడడం అంబేద్కర్ రాజ్యాంగం రాసిన అంబేద్కర్ ఉండి ఉంటే బాధపడేవాడని ఈ సభ్య సమాజానికి ఏమి హితబోధ చేస్తున్నావు ముఖ్యమంత్రి మీ పద్ధతులు మార్చుకోవాలి లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

**లేకుంటే సమ్మను ఉధృతం చేస్తాము.**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల పరిధి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా. మంథని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు సమ్మె వివరాలు రెండో పి ఆర్ సి అమలు చేయాలి. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి. హెల్త్ స్కీమును బేషరతుగా అమలు చేయాలి సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ ను వెంటనే పునరుద్ధరించాలి ఇవి చేయకుంటే సమ్మెను మరో ఉధృతం చేస్తామని ఉద్యోగులు తెలంగాణ గవర్నమెంట్కు అల్టిమట్టం జారీ చేశారు ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అటెండర్లు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



దర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలంలోని దర్పల్లి,రామడుగు ప్రాజెక్టు గ్రామంలో, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన డిసిసి ఉపాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజు, సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్ తెలంగాణ మార్క్ఫెడ్ ద్వారా పిఎసిఎస్ రామడుగు ఆధ్వర్యంలో ధర్పల్లి, ప్రాజెక్టు రామడుగు, గ్రామాలలో కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసి వాయిస్ ప్రెసిడెంట్ ఆర్మూర్ చిన్న బాలరాజు మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్ముకొని నష్టపోకుండా ఉండడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తుంది. ఈ నేపథ్యంలో మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు జరుగుతాయని మొక్కజొన్నకు మద్దతు ధర 24వందలు రేటు వస్తుంది రైతులు అధైర్య పడవద్దని రైతుల కోసం ఏ పనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ఆయన అన్నారు. రైతులు కూడా ఎమ్మెల్యేతో మాట్లాడినట్టుగా ఆయన రైతులు అడిగిన వెంటనే స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని దర్పల్లిలో ప్రారంభించారు. సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి పిఉపాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజు, సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, చెలిమెల నరసయ్య, ధర్పల్లి గ్రామ ఉప సర్పంచ్ శ్రీకాంత్, రామడుగు సొసైటీ సీఈవో ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగిత్య నాయక్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ చేలిమెల చిన్నారెడ్డి, గడ్డం గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని సచివాలయం వద్ద ధర్నా

**- ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్యను పరిష్కరించిన అధికారులు.**

**తుగ్గలి:**తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో గల ఎస్సీ కాలనీ నందు నీటి వసతి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నీటి సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎటువంటి చర్యలు చేపట్టలేదని కాలనీవాసులు తెలియజేశారు.శుక్రవారం రోజున సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శ్రీరాములు కాలనీవాసులతో కలసి నీటి సమస్యను పరిష్కరించాలని సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నాను నిర్వహించారు.ఎస్సీ కాలనీకు నీటి సరఫరాను చేసే వరకు ధర్నాను ఆపేదిలేదని వారు తెలియజేశారు. ధర్నా విషయం తెలుసుకున్న పత్తికొండ శాసనసభ్యులు కే.యి శ్యాంబాబు నీటి సమస్యను పరిష్కరించాలి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంలో జొన్నగిరి పంచాయితీ డెవలప్మెంట్ ఆఫీసర్ నారాయణస్వామి స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నీటి సమస్యలను పరిష్కరించారు. ఎమ్మెల్యే చొరవతో కాలనీకు నీటి సరఫరా జరగడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# వేసవి కాలము దొంగలతో జాగ్రత్త

**ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం**

**అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా ఎస్పీ శ్రీ. డి. వి. శ్రీనివాస రావు**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వేసవి కాలం సెలవులు ప్రారంభం అవుతున్న వేళ పెళ్లి ముహూర్తాలు,స్నేహితులతో, ఫ్యామిలీ మెంబర్స్ తో అంతా టూర్ ప్లాన్ చేస్తూ ఉంటారు. ఇదే అదునుగా దొంగతనాలకు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. దొంగతనాల నియంత్రణ కోసం జిల్లా ప్రజలు ఈ దిగువ తెలియజేసిన నిబశీధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించగలరు.ఇంటి బయట, డాబాల పైన పడుకునేవారు మెడలో నగలని జాగ్రత్తగా పెట్టుకోండి మరియు ఇంటిలో బంగారు ఆభరణాలు ఉంచకండి.బసుల్లో ప్రయాణాలలో మీ బ్యాగ్ను మీ పైన ఉంచుకొని గట్టిగపట్టుకొని వెంట అంటిపెట్టుకోండి, గుర్తు తెలియని వ్యక్తులు తిను బండరాలు, కూల్డ్రింక్స్ లాంటివి ఇస్తే తినకండి తీసుకోకండి.మీరు ఊరికి వెళ్ళే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు మరియు బంగారం ఆభరణాలు పెట్టకండి వాటిని బ్యాంకు లాకర్లో లేదా భద్రంగా ఉన్న చోట దాచుకోవడం ఉత్తమం. బీరువా తాళం చెవులు బీరువా పైన కానీ, బీరువాలోని బట్టల క్రింద కానీ, ఇంట్లో కానీ పెట్టి వెళ్లవద్దు.ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి గేటు బయట గొళ్ళెం పెట్టకండి. ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలి.ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచండి. బయట గేటుకు లోపల నుంచి తాళం వేయండి. బయటకు వెళ్ళేపుడు ఇంట్లో మరియు బయట లైట్ వేసి ఉంచండి.పేపర్ బాయ్ మరియు పాలు వేసే వాళ్లకు రావద్దని చెప్పండి.నమ్మకమైన వాచ్ మెన్ లను మాత్రమే నియమించుకోండి. మీరు ఊరికి వెళ్ళేటప్పుడు మీకు నమ్మకమైన వారికి అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వండి.ఊరికి వెళ్ళిన తర్వాత కూడా ఇంటి పక్క వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలి.బయటకు వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్త. వీలైతే చీర కొంగుతో కవర్ చేసుకుంటే మంచిదిమీ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది, భద్రత ఎక్కువగా ఉంటుంది. మీ ఇంటికి సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకుని ఐఎ= రహస్య ప్రదేశాలలో భద్రపర్చుకోవాలి. మరియు మొబైల్ యాప్ ద్వారా సీసీకెమెరా దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది.మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయకండి.మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే 100 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయండి.

## ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా జేఏసీ చైర్మన్ దొంత నరేందర్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ ఉద్యోగుల విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలన్నీ సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా ఉద్యోగ ఐక్య కార్యచరణ సమితి చైర్మన్ దొంత నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ కాంప్లెక్స్ లోనే తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భోజన విరామ సమయంలో భాగస్వామ్య సంఘాలతో కలసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న మూడు విడతల కరువుభత్యాలు మాత్రమే విడుదల చేశారని నూతన ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న ఐదు విడతల కరువు భత్యంతో పాటు గత ప్రభుత్వం 5% మధ్యంతర భృతి తో పిఆర్సి కమిషన్ వేసిందని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు పె రివిసన్ కమిషన్ పై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే కమిటీ నివేదిక తెప్పించుకొని వెంటనే 51 శాతం ఫిట్మెంట్ ప్రకటించాలని తెలియజేశారు. ఉద్యోగుల విశ్రాంత ఉద్యోగుల ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న 13వేల కోట్ల బకాయిలు యుద్ధ ప్రతిపాదకన విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వం నుండి తమ సొంత డబ్బులు విడుదల కాక మనోవేదన చెంది అనారోగ్యంతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల విశ్రాంత ఉద్యోగుల వేతనం నుండి 1.5% ప్రభుత్వం నుండి 1.5% భాగస్వామ్యంతో మూల నిధి ఏర్పాటు చేసి ఉద్యోగుల ట్రస్టు ద్వారా నగదు రహిత ఆరోగ్య కార్డులు జారీ చేస్తామని అనేక సమావేశాలు నిర్వహించి కాలయాపన చేయడం తగదన్నారు. నూతన ప్రభుత్వం సాధారణ ఎన్నికల ముందు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెడతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ఉద్యోగులపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఉద్యోగుల నిరసన నినాదాలతో కలెక్టరేట్ కార్యాలయం దద్దరిల్లిపోయింది. అనంతరం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను కలసి సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సెక్రెటరీ జనరల్ విట్టల్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, ట్రేస, పి ఆర్ టి యు, ఎస్ టి యు, యుటిఎఫ్, టిపిటిఎఫ్, టి టి యు, క్లాస్ ఫోర్త్, విశ్రాంత ఉద్యోగులు, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్ గౌడ్, సతీష్ రావు, రాజగోపాల్ గౌడ్, పద్మారావు, యాదగిరి, శివయ్య, ప్రసాద్, శ్యాంసుందర్, చరణ్ సింగ్, సౌమ్య నాయక్, నరేష్ కుమార్, వెంకట్రామిరెడ్డి, రిజ్వానలీ, గోలి కుమార్, సాంసన్ జయకర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కిషన్, తంస రాష్ట్ర అధ్యక్షులు శ్రీహరి, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లాసహా అధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు పజిలుద్దీన్, రఘునాథరావు, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు సతీష్, రామాయంపేట యూనిట్ అధ్యక్షులు ప్రభాకర్, ఏడుపాయల వనదుర్గ కార్యదర్శి ప్రశాంత్, సేర్ఫ్ బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి చంద్రహాస్, సహా అధ్యక్షుడు శ్రీకాంత్ కోశాధికారి లింగప్ప, ఉద్యోగ సంఘ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్, విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు జగదీష్ చంద్ర, సత్యనారాయణ సాయిబాబా, రమేష్ బాబు, నరేందర్, సునీల్, మధుసూదన్, తదితర భారీ ఎత్తున ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధిత బాలికకు అండగా నిలిచిన 98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్

**- మానవత్వాన్ని చాటిన "98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్"సభ్యులు**




వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ వీధికి చెందిన ఉప్పుల శ్రీనివాస్ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఆయన కుమార్తె కవిత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్లో కీమోథెరపీ చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి వారం 3 నుంచి 4 వేల రూపాయల వరకు ఖర్చవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఇదే సమయంలో శ్రీనివాస్ నివాస గృహం కూలిపోవడంతో, అద్దె ఇంట్లో ఉండే పరిస్థితి లేక భార్య స్వగ్రామమైన రాళ్లపేటకు వెళ్లి అక్కడే నివసిస్తున్నారు. వృత్తిరీత్యా శ్రీనివాస్ సుతారి పని చేస్తుండగా, ఆయన తల్లి బీడీలు చుట్టుతూ కుటుంబాన్ని పోషిస్తోంది.ఈ పరిస్థితిని గమనించిన 98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గొట్టం రాజు ద్వారా విషయం తెలుసుకొని వెంటనే స్పందించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.27,500 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, బీఆర్ఎస్ యువనేతలు నీలం శేఖర్, హింగే శివం, మామిడాల లీలా శంకర్, బాయి సుమన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ, అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.అలాగే ప్రజలను ఉద్దేశించి, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో ట్రస్ట్కు విరాళాలు అందించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.సంప్రదించాల్సిన నంబర్లు:98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్: 9573768834,హింగే శివం: 9989060856 బాయి సుమన్ శర్మ: 9490636736 లను సంప్రదించాలని కోరారు.

## ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**నగరంలోని ఏ మూల ఏం జరిగినా క్షణాల్లో తెలిసిపోయేలా ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనిచేస్తుంది**

**స్మార్ట్ సిటీ లో ప్రతిష్టాత్మకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు**



తిరుపతి (ప్రశ్న న్యూస్) స్మార్ట్ సిటీ లో ప్రతిష్టాత్మకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కచ్చపి ఆడిటోరియం నందు తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను శుక్రవారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమీషనర్ ఎన్.మౌర్య ప్రారంభించి కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలించారు.స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నగరంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. నగరంలోని ఏ మూల ఏం జరిగినా క్షణాల్లో తెలిసిపోయేలా ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఉల్లంఘన, ఎమర్జెన్సీ, మున్సిపల్ సేవలు, వాహనాల దొంగతనాలు, నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలు గుర్తించడం వంటి వాటికోసం ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎంత ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సెంటర్ నిర్వహణ చక్కగా చేయాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. స్మార్ట్ సిటీలైన వైజాగ్, కాకినాడ తరహాలో తిరుపతి నగరంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసి ట్రాఫిక్, శానిటేషన్, ఎమర్జెన్సీ వంటి సేవలకు ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. ఒక చోట నుండే నగరంలోని అన్ని ప్రాంతాల్లో జరిగేటువంటి వాటిని ఆపరేట్ చేయడానికి వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో హస్తకళల శాఖ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జి.ఎం.చంద్రమౌళి, ఈ.ఈ.రవి, ఎన్.ఈ.సి., కెల్ట్రాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య
- కనుకయ్య ఆధ్వర్యంలో మండల నూతన తహసిల్దార్‌కు సన్మానం - శుభాకాంక్షలు



బోయినిపల్లి(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసిల్దార్ ఎండి షరీఫ్ మొయినోద్దీన్ ను విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనకయ్య మాట్లాడుతూ, మండల అభివృద్ధికి తహసిల్దార్ పూర్తి సహకారం అందించాలని ఆకాంక్షించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ ఉప సర్పంచ్ పోత్తూరి శైలజ, వార్డు సభ్యులు సుంకపాక హేమలత, అనిల్, జోగు శంకర్, బోయినిపల్లి ఏఎంసీ డైరెక్టర్ కల్లెపల్లి సతీష్, దొబ్బల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవికాలం దృష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేసిన వేములవాడ మున్సిపల్

- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు చేతుల మీదుగా "చలివేంద్రం"ప్రారంభం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అందుబాటులోకి ఈ సేవను తీసుకొచ్చారు.ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ, వేసవి కాలంలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే సందర్శకులు,పాదచారులు, స్థానిక ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అలాగే పట్టణంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన చోట్ల నీటి సరఫరాను మెరుగుపరుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెట్‌పల్లి బార్ అసోసియేషన్ కమిటీకి ఎమ్మెల్యే డా. సంజయ్ అభినందనలు



మెట్ పల్లి (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా,మెట్‌పల్లి బార్ అసోసియేషన్‌కు ఇటీవల ఎన్నికైన అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి సహా నూతన కార్యవర్గ సభ్యులను కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం సన్మానించారు. శాలువాలు కప్పి వారిని అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,న్యాయవాదులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తారని, బార్ అసోసియేషన్ సభ్యులు ప్రజలకు న్యాయం అందించడంలో ముఖ్యమైన బాధ్యత వహిస్తున్నారని అన్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు న్యాయవాదుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు.అదేవిధంగా మెట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్,బార్ అసోసియేషన్ అభివృద్ధికి అవసరమైన సూచనలు,వినతిపత్రాలు అందజేస్తే వాటి పరిష్కారానికి తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, కార్యవర్గ సభ్యులు కాజీపేట స్రవంతి, ఆకుల మానస, మాలేపు సంధ్యారాణి, బిగుల్లా శంకర్, మగ్గిడి నర్సయ్య,నీరటి రమణ, తలారి రాజశేఖర్,ద్యావని సత్యనారాయణ,నత్తి రాజశేఖర్ పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు సబ్‌కోటా ఇవ్వాలి

- డీలిమిటేషన్ కు ముందు కులగణన అవసరం
-నల్ల చొక్కాతో నిరసన తెలిపిన బీసీ నేత : పాలాస నరేందర్



వేములవాడ (ప్రశ్న న్యూస్)సమగ్ర కులగణన చేపట్టకుండా, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా మహిళ రిజర్వేషన్, డీలిమిటేషన్ అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీసీ నేత పొలాస నరేందర్ నల్ల చొక్కా ధరించి నిరసన తెలిపారు.మహిళ రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నామని, అయితే కులగణన పూర్తయ్యాకే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కుల గణాంకాలు లేకుండా రిజర్వేషన్లు అమలు చేస్తే కొన్ని వర్గాల మహిళలకే ప్రయోజనం చేకూరుతుందని, బీసీ మహిళలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.చట్టసభల్లో 33 శాతం మహిళ రిజర్వేషన్లలో బీసీ మహిళలకు 16.5 శాతం సబ్‌కోటా కల్పించాలని, దీనిపై జాతీయ స్థాయిలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు.దేశంలో సుమారు 40 కోట్ల బీసీ మహిళల హక్కులను గౌరవిస్తూ సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. లేదంటే బీసీ సాధికారిత సంఘం ఈ బిల్లును అంగీకరించబోదని హెచ్చరించారు.

# సీబీఎస్ఈ ఫలితాల్లో పీఎం శ్రీ 'కేంద్రీయ' ప్రభంజనం

- వంద శాతం ఉత్తీర్ణతతో విద్యార్థుల రికార్డు







తిరుపతి బ్యూరో (ప్రశ్న న్యూస్) సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో వెంకటగిరి మండలం బొప్పాపురంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారు. బుధవారం సాయంత్రం విడుదలైన ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించినట్లు ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పి. ఆనంద్ గణేష్ తెలిపారు.పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన మొత్తం 55 మంది విద్యార్థులూ ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, అందరూ ప్రథమ శ్రేణిలో నిలవడం విశేషమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో కూడిన ఈ పరీక్షల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ స్థాయిలో రాణించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.పాఠశాల స్థాయిలో అత్యుత్తమ మార్కులతో సత్తా చాటిన టాపర్ల అవికా కలచూరి: 500 మార్కులకు గాను 474,మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.జి. గురు ప్రవీణ్: 427 ,మార్కులతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. జె. మోహిత్ సాయి: 423 ,మార్కులతో తృతీయ స్థానంలో నిలిచాడు.2025-26 విద్యా సంవత్సరంలో ఈ ఘన విజయం సాధించినందుకు విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల కృషికే ఈ విజయం నిదర్శనమని ఆయన కొనియాడారు. విజేతలను తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలతో ముంచెత్తారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి పెంచిన జేఏసీ

- పెండింగ్ బిల్లులు,డీఏల విడుదలకు డిమాండ్
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్



బోయినిపల్లి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) మరోసారి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలతో పాటు న్యాయబద్ధమైన డిమాండ్లు అమలు కావడం లేదని జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొన్ని అంశాలు పరిష్కారం అయినప్పటికీ, ఉద్యోగులకు సంబంధించిన ప్రధాన సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని వారు తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు సీఎస్ సహా ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరైన స్పందన లభించలేదని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో టీజీఈ జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ ఏొడ్నాల రాజశేఖర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నేడు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్ల డివిజన్‌తో పాటు మండల కేంద్రాల్లో ఉద్యోగులు ఆర్డీఓలు, తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## జేఏసీ ప్రధాన డిమాండ్లు

జూన్ 2 నాటికి పీఆర్సీ అమలు చేయాలని, రిటైరైన ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. హెల్త్ కార్డుల అమలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ,2004 సెప్టెంబర్ 1కు ముందు నియామకమైన వారికి ఓపీఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పెండింగ్ డీఏలు విడుదల,61 సంవత్సరాలు నిండిన వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, సాధారణ బదిలీల నిర్వహణ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్,టీజీఆర్‌ఎస్‌ఏ బాధ్యులు భూపేష్ రెడ్డి, జీపీవో బాధ్యులు కావేరి, తిరుపతి,కనుకయ్య, నరేందర్,సత్యనారాయణ, మధుసూదన్ రావు, వెంకట్రావు తదితర తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలి

ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరించాలి.
సమ్మర్ యాక్షన్ ప్లాన్ తో గ్రామాలలో డ్రింకింగ్ వాటర్ సమస్యలను నిర్మూలించాలి
మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని.ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరిం. చాలని. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారుశు క్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం పై వర్క్ షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా వినియోగించి గ్రామా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు మోడల్ గా తీర్చిదిద్దాలని, గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు, అంగన్వాడీ బిల్డింగ్స్, జిపి బిల్డింగ్స్ లేని గ్రామాలకు నూతన బిల్డింగ్స్ ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రత్యేక అధికారి, పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్ సమన్వయంతో గ్రామ పంచాయతీలో పనులు సవ్యంగా నడవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని 15 ఆర్థిక సంఘం నిధులను అన్ని గ్రామాలకు ప్రభుత్వం అందించిందని ,వాటితో గ్రామాల్లో సమస్యలు లేకుండా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. నిధుల వినియోగం లో అక్రమాలకు తావులేదన్నారు. నిధులు సక్రమంగా వినియోగించక పోతే ,అక్రమాలు జరిగితే సర్పంచ్ , కార్యదర్శుల పై చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో త్రాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఈ.ఈ మిషన్ భగీరథ ఇంట్రా సంపత్ కుమార్, గ్రిడ్ డి.ఈ నాగభూషణం, డిఎల్పిఓలుసాయి బాబు, తిరుపతి రెడ్డి ,అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీచర్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో స్వరాజ్యలక్ష్మీ ప్రతిభకు గుర్తింపు

- అంతర్జాతీయ విద్యా పర్యటనకు ఎంపికైన చందుర్తి ఉపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మీ



చందుర్తి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీచర్స్ ఎక్స్పోజర్, ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్ ద్వారా రాష్ట్ర ఉపాధ్యాయులను ఫిన్లాండ్, జపాన్, సింగపూర్, వియత్నాం వంటి దేశాలకు పంపించి అక్కడి ఉత్తమ విద్యా విధానంపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమానికి అక్టోబర్ 2025లో జిల్లాల వారీగా ఎంపికలు నిర్వహించగా, 55 ఏళ్లలోపు వయస్సు, కనీసం 10 సంవత్సరాల సేవ, ఉత్తమ బోధన పద్ధతులు వంటి ప్రమాణాల ఆధారంగా ఉపాధ్యాయులను ఎంపిక చేశారు.ఈ క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా,చందుర్తి మండలం, తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ రామగిరి స్వరాజ్యలక్ష్మి జిల్లాలో ఏకైకంగా ఎంపిక కావడం విశేషం.ఏప్రిల్ 18 నుంచి 25 వరకు ఫిన్లాండ్ దేశానికి వెళ్లనున్న తొలి బృందంలో 28 మంది ఉపాధ్యాయులతో పాటు, ఎస్సీఈఆర్టి, డిఎస్ఈ అధికారులు కలిపి మొత్తం 40 మంది పాల్గొననున్నారు. ఈ బృందంలో ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రానా, ఎస్ఈఆర్టి డైరెక్టర్ రమేష్ కూడా ఉండటం పర్యటనకు ప్రత్యేకతను చేకూర్చింది. స్వరాజ్యలక్ష్మి 20 సంవత్సరాలకు పైగా బోధనా అనుభవం కలిగి ఉండి, గణితంలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌గా, హ్యాండ్‌బుక్స్ రచయితగా సేవలందించారు. అలాగే ఎన్ఈపి - 2020లో భాగంగా ఢిల్లీలో జరిగిన ఎన్.సి.ఆర్.టి. శిక్షణకు రాష్ట్రం తరపున ఎంపికైన ప్రాథమిక ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారు.రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంపిక కావడంతో పలువురు ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

# నేడు గ్రామంలో విద్యుత్ అంతరాయం

- బోయినిపల్లి సెస్ ఏ.ఈ : ప్రశాంత్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుపల్లి గ్రామంలో నేడు శనివారం 11 కేవీ లైన్ పరిధిలో చెట్ల కొట్టివేత పనులు చేపట్టినందున ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఈ సందర్భంగా సెస్ వినియోగదారులు సహకరించాలని బోయినిపల్లి సెస్ ఏఈ ప్రశాంత్ తెలిపారు.

# తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చడం ఘోర అవమానం

- బీజేపీ ఎంపీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- తెలంగాణ గౌరవాన్ని కాపాడాలి
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నేత, నీలోజిపల్లి సర్పంచ్ : అనుముల భాస్కర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును శత్రు దేశం పాకిస్థాన్‌తో పోల్చడాన్ని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా అనుముల భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన అనేది లక్షలాది మంది ప్రజల త్యాగాలు, ఉద్యమాల ఫలితమని అన్నారు. అలాంటి పవిత్రమైన పోరాటాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం అనేది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటుకు రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అనుసరించి, దేశ పార్లమెంట్ ఆమోదంతో రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు.ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల మధ్య విభేదాలను రెచ్చగొట్టేలా ఉంటాయని, వెంటనే వాటిని ఉపసంహరించుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అనుముల భాస్కర్ డిమాండ్ చేశారు.

# వరదవెల్లిలో విషాదం.. అప్పుల భారంతో వృద్ధుడి ఆత్మహత్య

- బోయినిపల్లి ఎస్సై : ఎన్. రమాకాంత్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండల పరిధిలోని వరదవెల్లి గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వల్లంపట్ల ఎల్లయ్య (71) అప్పుల భారాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల కొత్త ఇల్లు నిర్మాణం చేయడం వల్ల ఎల్లయ్య అప్పులపాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో జీవితం పట్ల విరక్తి చెంది,శుక్రవారం తెల్లవారుజామున తన కొత్త ఇంటి మెట్ల వద్ద లుంగీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడి కుమారుడు వల్లంపట్ల దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బోయినిపల్లి ఎస్ఐ ఎన్. రమాకాంత్ తెలిపారు.

## సాన సతీష్ నివాసంలో ఆత్మీయ విందులో పాల్గొన్న
# విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**- పార్లమెంట్ సభ్యులు, మహిళా ప్రజాప్రతినిధులతో సౌహార్ద వాతావరణంలో చర్చలు**



**విజయవాడ (ప్రశ్న న్యూస్)** రాజ్యసభ సభ్యులు సాన సతీష్ స్వగృహంలో నిర్వహించిన ఆత్మీయ విందు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ విందుకు పలువురు పార్లమెంట్ సభ్యులు మహిళా ప్రజాప్రతినిధులు హాజరై పరస్పర ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలు, మహిళా సాధికారత, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై చర్చలు జరిగాయి. ముఖ్యంగా మహిళల భాగస్వామ్యం పెంపు, అభివృద్ధిలో వారి పాత్రపై అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమం సౌహార్ద వాతావరణంలో సాగుతూ, ప్రజాప్రతినిధుల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసేలా నిలిచింది. ఈ విందు ద్వారా పరస్పర అవగాహన పెంపొందించి, భవిష్యత్‌లో సమన్వయంతో పనిచేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు
# 43 వినతులు

**- జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు**



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 43 వినతులు స్వీకరించడమైనదని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం తన ఛాంబర్ లో సిపి లు, డీసీపీలు, ఏసీపీ లతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ జీవీఎంసీ లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పి జీ ర్ స్లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించ్టందుకు గానూ ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 43 వినతులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా మధురవాడ జోన్ కు 06, ఈస్ట్ జోన్ కు 09, సౌత్ జోన్ కు 02, నార్త్ జోన్ కు 08, వెస్ట్ జోన్ కు 05, పెందుర్తి జోన్ కు 11, గాజువాక జోన్ కు 01, మెయిన్ ఆఫీస్ కు 01 వినతులు వచ్చాయని తెలిపారు. స్వీకరించిన వినతులను /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదన్నారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

## రాయదుర్గంలో పీఎం సూర్యఘర్‌ను
# ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

**- రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఉచిత సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు**

**- విద్యుత్ రంగంలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి**



**రాయదుర్గం(ప్రశ్న న్యూస్ )** పీఎం సూర్యఘర్ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారులకు విద్యుత్ భారం తగ్గి, నిరంతరాయంగా విద్యుత్ అందుతుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలోని కాలనీలో 'ప్రధాన మంత్రి సూర్యఘర్ - ముఫ్త్ బిజిలీ యోజన' పథకాన్ని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శుక్రవారం నాడు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రగతి పండుగ' కార్యక్రమంలో పాల్గొని రూ.30 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ పేద వర్గాలకు లబ్ధి చేకూర్చాలన్న సంకల్పంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం సూర్యఘర్ కార్యక్రమాన్ని రూపొందించాయన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో 'పీఎం సూర్యఘర్' పథకం ద్వారా రూ.27 కోట్ల వ్యయంతో 2400 ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచిత సోలార్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఈ పథకం ద్వారా అయ్యే రూ.1.25 లక్షల ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తూ పూర్తి ఉచితంగా అందిస్తున్నాయని పేర్కొన్నారు. అంతేగాకుండా ఈ పథకం ద్వారా ఓసీ వినియోగదారులకు రూ.78,000, బీసీలకు రూ.98,000 రాయితీ అందిస్తున్నామని అన్నారు. విద్యుత్ రంగంలో సమగ్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి పేర్కొన్నారు. ముఖ్యంగా పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచేందుకు, రాష్ట్రం వ్యాప్తంగా 6 లక్షల ఉచిత సూర్యఘర్ కనెక్షన్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

# ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే కుట్రలు ఆపాలి

**- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల గ్రేట్ మీటింగ్**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు భారీగా గ్రేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మౌలానా, రాష్ట్ర కోశాధికారి యాదన్న, నాయకులు జక్కుల నర్సిములు, డిపో జేఏసీ కన్వీనర్ రాజయ్య పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఆర్టీసీ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అయితే ఈ పథకం కారణంగా డ్రైవర్లు, కండక్టర్లపై పని ఒత్తిడి అధికమైందని, రద్దీ బస్సుల్లో చిన్నపాటి తప్పిదాలకే ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీకి చెందిన విలువైన భూములు, వర్క్‌షాపులు, డిపోలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయకుండా ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

### ప్రధాన డిమాండ్లు..

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి వేతన సవరణ, ఉద్యోగ భద్రత కల్పించాలి అన్ని ప్రభుత్వ శాఖల మాదిరిగా సౌకర్యాలు అందించాలి ప్రభుత్వం సమ్మె నిషేధం పేరుతో కార్మికులను బెదిరిస్తోందని ఆరోపించిన నాయకులు, ఈ బెదిరింపులకు భయపడబోమని స్పష్టం చేశారు. 22న

### బంద్ హెచ్చరిక..

తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 22న ఆర్టీసీ బంద్ నిర్వహిస్తామని జేఏసీ హెచ్చరించింది. ఆ రోజు బస్సులు నిలిపివేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రజలు కూడా ఆర్టీసీ కార్మికుల ఉద్యమానికి మద్దతుగా నిలబడి బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, అంబాదాస్, పద్మ, కరీముద్దీన్, సిద్ధరాములు, మహేష్, గఫూర్, శ్యామ్ సుందర్, శంకర్ తదితర జేఏసీ నాయకులు, ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉద్రిక్త వాతావరణంలో సాగింది.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ధర్నా

**- డి. శ్రీనివాసచారి, అధ్యక్షులు, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ( ఐ ఎన్ టి యు సి అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఒకరోజు ధర్నా నిర్వహించారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు దశల వారీ ఆందోళనలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు డి. శ్రీనివాసచారి మాట్లాడుతూ ఉద్యోగుల పలు కీలక డిమాండ్లను వెల్లడించారు. వాటిలో ప్రధానంగా రెండో వేతన సవరణ సంఘం ( పి ఆర్ సి ) నివేదికను తక్షణమే అమలు చేయడం, పెండింగ్ డీఏలు మంజూరు చేయడం, పాత పెన్షన్ విధానం ( ఓ పి ఎస్ ) అమలు, ఉద్యోగులకు రావలసిన బకాయిల చెల్లింపు, అక్రమ బదిలీల రద్దు వంటి అంశాలు ఉన్నాయి. అదేవిధంగా టైమ్ స్కేల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, ఈఎస్ఐ అమలు కోసం జి ఓ 126 సవరణ, దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి ప్రమోషన్లు కల్పించడం, జి ఓ 317 బాధితులకు ఉపశమనం కల్పించడం, కొత్త నియామకాల ద్వారా పనిభారం తగ్గించడం వంటి డిమాండ్లు కూడా ప్రస్తావించారు. గతంలో ఎన్నోసార్లు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కానందునే ఈ ఆందోళనకు దిగామని ఆయన తెలిపారు. దశలవారీ ఉద్యమంలో తొలి దశగా ఈ ధర్నా చేపట్టినట్లు చెప్పారు. రోగులకు అసౌకర్యం కలగకుండా ఉదయం హాజరు సమయాన నిరసన కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, అనుకూల నిర్ణయం తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ విమల, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు జగదాంబ, వకులాదేవి, నిర్మల, ఉమామహేశ్వరి, ఫార్మసీ ఆఫీసర్లు మోహన్, బండారి స్వర్ణలత, శిరీష, రమాదేవి, నర్సింగ్ ఆఫీసర్లు షాహిని, రశ్మి, శోభ, రాజు, గౌతమి, హెడ్ నర్సెస్ విమలదేవి, నిర్మల తదితరులు, అలాగే పారామెడికల్ మరియు సానిటరీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

## కేసు నుంచి తప్పిస్తామని
# డబ్బుల వసూలు యత్నం..!

**- రిపోర్టర్‌పై కేసు నమోదు...!!**

**- డబ్బులు ఇవ్వకపోతే వార్తలు రాస్తానని బెదిరింపు చర్యలు**

**- మధ్యవర్తిత్వం పేరుతో వసూళ్లకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

**- పోలీసు సేవలకు డబ్బులు అవసరం లేదు - పూర్తిగా ఉచితం**

**- భీంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : పొన్నం సత్యనారాయణ గౌడ్**



**భీంగల్ ( ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా,భీంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నుంచి తప్పిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసిన ఓ రిపోర్టర్‌పై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పురాణిపేట గ్రామానికి చెందిన ఫిర్యాదిదారుని కుమారుడిపై భీంగల్ పి.ఎస్‌లో కేసు నమోదు కాగా, ఆ కేసును సెటిల్ చేస్తామని చెప్పి ఫిర్యాదిదారుని వద్ద రూ. లక్ష డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే డబ్బులు ఇవ్వనందుకు ఆ వ్యక్తి ఫిర్యాదిదారుని షాప్‌కు వెళ్లి అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు,వారి విషయాన్ని పత్రికలో ప్రచురిస్తామని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా భీంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పొన్నం సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ పనులు చేయిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ సేవల కోసం ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని,పూర్తిగా ఉచితంగా సేవలను అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# సోషల్ మీడియా యువత సంస్కృతిపై ప్రభావం

**- గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో వెబినార్**




**గజ్వేల్(ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అనుమతితో సోషల్ సైన్సెస్ విభాగం మరియు మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో "సోషల్ మీడియా ట్రాన్స్ఫార్మింగ్ యూత్ కల్చర్" అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ, నేటి యువత సోషల్ మీడియాకు బానిసలై తమ లక్ష్యాలను నిర్లక్ష్యం చేస్తూ జీవితంలో ముందుకు సాగడంలో వెనుకబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వెబినార్‌కు ముఖ్యవక్తగా పాల్గొన్న నేషనల్ యూత్ అవార్డు గ్రహీత, కాకతీయ యూనివర్సిటీ వరంగల్‌కు చెందిన పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆకులపల్లి మధు మాట్లాడుతూ, సోషల్ మీడియా ద్వారా విద్యార్థులకు ప్రధానంగా మూడు అంశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు -- విద్య, ఉద్యోగావకాశాలు, వినోదం. అయితే విద్యార్థులు విద్య మరియు ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించకుండా వినోదానికి అధిక ప్రాముఖ్యత ఇవ్వడం వల్ల సమాజానికి హానికరంగా మారుతున్నారని చెప్పారు. దేశంలో 40 కోట్లకు పైగా యువత ఉన్నారని, అందులో సుమారు 50 శాతం మంది సోషల్ మీడియా ప్రభావానికి లోనై సోమరితనం, నిర్లక్ష్యం, అలసట వంటి లక్షణాలు పెంచుకుంటూ తమ లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా యువత పక్కదారి పట్టి పరిసరాలు, పరిస్థితుల పట్ల దూరమవుతున్నారని అన్నారు. ఇంకా చాలా మంది విద్యార్థులు టెన్త్, ఇంటర్ దశలలోనే చదువును మధ్యలోనే ఆపివేస్తున్నారని, మానవ సంబంధాలు, కుటుంబ బంధాలు కూడా తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, గురువులు, దైవం, భవిష్యత్తు పట్ల గౌరవంతో సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించి లక్ష్యసాధన వైపు అడుగులు వేస్తేనే యువత జీవితం సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి కమలా క్రిస్టియాన, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ శ్రీమతి ఎం.ఎం. లక్ష్మి, వెబినార్ కన్వీనర్ డాక్టర్ బి. మురళీధర్, కో-కన్వీనర్ శ్రీమతి బి. కస్తురిబాయ్, డాక్టర్ డి. సుజాత, డాక్టర్ పి. జయరాజులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక కళాశాలల నుండి అధ్యాపకులు, విద్యార్థులు ఆన్‌లైన్‌లో పాల్గొని వెబినార్‌ను విజయవంతం చేశారు.

# శ్రీ స్వామి అమ్మవార్లకు ఊయలసేవ



**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** లోకకల్యాణం కోసం దేవస్థానం సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించారు. శుక్రవారం రోజు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.


## కాలబైరవుడికి గ్రంథ అమావాస్య
# సందర్భంగా మహాభిషేకం



**గాజువాక (ప్రశ్న న్యూస్)**జీవీఎంసీ పరిధి 65వ వార్డు వాంబే కాలనీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కాలబైరవ స్వామికి గ్రంథ అమావాస్య సందర్భంగా మహాభిషేకం ప్రత్యేక హోమాలు పూజలు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో జరిపించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈరోజు గ్రంథ అమావాస్య పితృదేవతలకు అత్యంత ప్రీతిపదమైన అమావాస్య కాలబైరవుడికి అభిషేకం హోమంలు చేయడం జరిగిందని దీనివల్ల మన పితృదేవులకు మన కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు , కలుగుతాయని స్వామివారిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని దృఢ సంకల్పంతో స్వామిని పూజిచేసి స్వామివారి కృపకు పాత్రులు అవుతారని అన్నారు. గాజువాక ప్రాంతంలో కాల బైరవ దేవస్థానం నిర్మించడం ఎంతో శుభదాయకమని కొనియాడారు పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకుని వారి కోరిన కోరికలు తీర్చుకోవలసిందిగా ప్రజలను అభ్యర్థించారు. పూజా కార్యక్రమం రాఘవేంద్ర శర్మ సారిధ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు, హరికృష్ణ,ఉషారాణి,హిమజ, పద్మ, చిట్టెమ్మ, కాంతమ్మ, బి.వెంకటేష్ ఆలయ కమిటీ సభ్యులు కాలనీ భక్తులందరూ పాల్గొన్నారు

# పుణ్యం చేయబోతే
# పాపం కట్టుకున్నట్టు అయ్యింది ఆ వృద్ధుల పరిస్థితి

- 2000/- రూపాయల జరిమానా కట్టిన శిక్ష పూర్తి కాలేదు - చెట్టుకు ఐదు చెట్లు నాటాలని తీర్మాణం, అవగాహన లేని అక్షరాసురులతో ప్రజలకు నష్టం
- మంచి చేద్దామనుకున్న 70 ఏళ్ల వృద్ధులకు కష్టం తెచ్చుకున్నట్లు అయింది







**ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్)** పుణ్యం చేయబోతే పాపం కట్టుకున్నట్టు" అనేది ఒక తెలుగు సామెత. ఆ సామెతను అక్షరాల నిజం చేశారు అక్షరాసురులు. మంచి పని చేద్దామని లేదా ఒకరికి సహాయం చేద్దామని వెళితే, అది ఎదురుతిరిగి మనకే కష్టాలు, సమస్యలు చెడ్డపేరు తెచ్చిపెట్టినప్పుడు ఈ సామెతను ఉపయోగిస్తారు. వివరాల్లోకి వెళితే సిరిసిల్ల జిల్లాలోని పోతిరెడ్డిపల్లికి చెందిన చెన్నమేని నర్సయ్య, చెన్నమేని రాజలింగయ్య తన వ్యవసాయ పొలంలో చెట్ల కొమ్మలు వంగడంతో వరి కోతకు ఇబ్బంది అవుతుందని, కోతులు కొమ్మల మీద నుండి పొలంలో దుంకి నష్టం చేస్తున్నాయని, పొలంలోకి వంగిన కొమ్మలను నరికి వేస్తుండగా, కోనరావుపేట మండలంలోని వివిధ గ్రామాలలో నుండి వస్తున్న వాహనదారులు రహదారి చెట్ల వల్ల కనిపించడం లేదని, ప్రమాదాలు జరుగుతున్నాయని మరిన్ని జరిగే అవకాశం ఉందని అక్కడి చెట్లు మొత్తం కొట్టేయమని వృద్ధులను కోరడంతో ప్రజల ప్రాణాలు కాపాడినట్లు అవుతుందని చెట్లు మధ్యలోకి నరికి వేశారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లను నరికివేశారని పత్రికల్లో రాయడంతో వృద్ధులను పిలిపించి గ్రామపంచాయతీలో చెట్లు నరికినందుకు జరిమానా విధించినట్లు సర్పంచ్ మౌనిక తెలిపారు. పోతిరెడ్డిపల్లి శివారులో రోడ్డు కిరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు, చెట్లు తమ పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారినవని వాహనదారులకు దారి కనిపించకుండా ఇబ్బంది అవుతుందని వచ్చిపోయే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగి ప్రాణా నష్టం అయ్యే అవకాశం ఉన్నందున కొట్టివేశామని చెట్టుకు ఐదు చెట్లు పెడతామని అన్న కూడా 2000 రూపాయల జరిమానా విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన కూడా శిక్ష పూర్తి కాలేదని ఆ వృద్ధులు తెలిపారు. అవగాహన లేకుండా ఇద్దరు వృద్ధులు నర్సయ్య, రాజలింగం చెట్లను, కొమ్మలను అనుమతి లేకుండా నరికి వేశారని, దీంతో వారికి రూ.2వేలు జరిమానాతో పాటు నరికిన ఒక్కో చెట్టుకు మరో ఐదు చెట్లు నాటి వాటి సంరక్షణ చూసే బాధ్యత కూడా చూడాలని గ్రామపంచాయతీలో తీర్మాణం చేసినట్లు తెలిపారు. చాలా పెద్ద వయసు ఉన్న వృద్ధులు అవగాహన లోపంతో చేసిన పనికి ఇంత శిక్ష వేస్తారని పచ్చని పల్లెల్లో కల్మషం లేని ఆ 70 ఏళ్ల వృద్ధుల వయసు కన్నా విలువ ఇవ్వకపోవడం, పూర్తిస్థాయిలో సమస్యను తెలుసుకోకుండా పత్రికలలో కథనాలు రాయడం, ప్రమాదాలు జరగకుండా వాళ్లు మంచి చేద్దామనుకున్న విషయాన్ని విస్మరించి, విషపు రాతలతో పేదవారి కడుపు కొడుతున్న మేధావులు అంతర్మధనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# విపరీతంగా పెరుగుతున్న పొల్యూషన్

- హైదరాబాద్ వాసులకు ఊపిరి తీసుకోవడమే సవాల్
- రోజుకు వేలల్లో కొత్త వాహనాలు.. కాలుష్యంతో నగరం ఉక్కిరిబిక్కిరి
- అధికారుల నిర్లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమం గాలికే
- పర్యావరణంపై ముప్పు, 45 డిగ్రీల దాటుతున్న ఉష్ణోగ్రతలు

**(గౌటి రామకృష్ణ -- ప్రశ్న న్యూస్)**




గ్రేటర్ హైదరాబాద్ నగరం రోజురోజుకు పెరుగుతున్న పొల్యూషన్‌తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నగరంలో రోజుకు వేల సంఖ్యలో కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తుండగా, వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకుంటోంది. ఒకప్పుడు పచ్చని చెట్లతో కళకళలాడిన నగరం ఇప్పుడు కాంక్రీట్ అడవిగా మారిపోతోంది. వాహనాల నుంచి వెలువడుతున్న విష వాయువులు ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.ప్రభుత్వం ప్రతి సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమాలను ఘనంగా ప్రకటిస్తున్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యంతో వాటి అమలు మాత్రం కనిపించడంలేదు. ప్రారంభంలో హడావుడిగా మొక్కలు నాటి, తర్వాత వాటి సంరక్షణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రతి సంవత్సరం ఇలాగే జరుగుతుందని అధికారులు విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా, లక్షలలో నాటిన మొక్కలు చాలా వరకు ఎండిపోయి కనుమరుగవుతున్నాయి.పర్యావరణ నిపుణులు చెబుతున్న ప్రకారం, నగరంలో గ్రీన్ కవరేజ్ తగ్గిపోవడం వల్ల ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని గతంతో పోలిస్తే ప్రస్తుతం వేసవిలో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్ నగరంలో చెట్ల కొరత తీవ్రంగా ఉందని పెరుగుతున్న వాహనాల సంఖ్య, నిర్మాణాల విస్తరణ విస్తరణ కలిసి నగరాన్ని హీట్ ఐలాండ్‌గా మార్చుతున్నాయి.వాహనాల పెరుగుదలపై నియంత్రణ లేకపోవడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను సరైన విధంగా ప్రోత్సహించకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని పలుమార్లు నిపుణులు సూచించినప్పటికీ, అమలు స్థాయిలో పెద్దగా మార్పులు కనిపించడం లేదు.ఇక ప్రజల్లో కూడా పర్యావరణంపై అవగాహన లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక్కొక్కరు ఒక్క మొక్క నాటి సంరక్షించాలని బాధ్యత తీసుకోకపోవడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. ప్లాస్టిక్ వినియోగం, చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం కూడా కాలుష్యానికి దారితీస్తున్నాయి.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నగర జీవనం మరింత క్లిష్టంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, మొక్కలు నాటే కార్యక్రమాలను సంరక్షణను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వాహనాల నియంత్రణపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.పర్యావరణాన్ని కాపాడటం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం కూడా. లేదంటే "శ్వాస తీసుకోవడానికి కూడా డబ్బులు పెట్టే రోజులు దూరంలో లేవు.

# అపార్ట్‌మెంట్లలో ఈవీ చార్జింగ్ పాయింట్లు తప్పనిసరి

## - తెలంగాణ సర్కారు కొత్త పాలసీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇకపై రాష్ట్రంలోని అపార్ట్‌మెంట్ భవనాల బేస్‌మెంట్‌లో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా కొత్త విధానాన్ని రూపొందిస్తోంది. ఈ మేరకు ఇంధన శాఖ కసరత్తు చేస్తోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. ఈ నిర్ణయంతో నగరవాసులకు ఇళ్లలోనే సులువుగా ఛార్జింగ్ చేసుకునే సౌకర్యం కలగనుంది. శుక్రవారం నాడు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నవీన్ మిట్టల్ ఈ విషయాన్ని వెల్లడించారు.



పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన ఇంధన వినియోగం లక్ష్యంగా ఈవీల వాడకాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని సీఎస్ నొక్కిచెప్పారు.ఈవీ వినియోగదారుల్లో విశ్వాసం పెంచేందుకు బలమైన, విస్తృతమైన ఛార్జింగ్ నెట్‌వర్క్ చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఛార్జింగ్ సౌకర్యాలు సులభంగా, విశ్వసనీయంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే, రాష్ట్రంలోని ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను మ్యాప్ చేయడానికి, పర్యవేక్షించడానికి ఒక కేంద్రీకృత, రియల్-టైమ్ డాష్‌బోర్డ్‌ను అభివృద్ధి చేయాలని కూడా సీఎస్ సూచించారు. ఈ సమీక్షలో రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టీజీఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రవాణా కమిషనర్ ఇళంబరితి, టీజీఐఐసీ వీసీ, ఎండీ శశాంక, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, టీజీరెడ్కో ఎండీ అనీల వావిళ్ల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### లోక్ సభలో మహిళా రిజర్వేషన్

# బిల్లుకు చుక్కెదురు

## - విపక్షాల తీరుపై చంద్రబాబు ఫైర్




**అమరావతి (ప్రశ్న న్యూస్)** చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే కీలక బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు చారిత్రక తప్పిదానికి పాల్పడ్డాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఇది కేవలం రాజకీయ దురుద్దేశం మాత్రమే కాదని, పార్లమెంటులో సమాన ప్రాతినిధ్యం ఆశిస్తున్న లక్షలాది మంది మహిళలకు చేసిన ద్రోహమని ఆయన అన్నారు. ఈ విషయాన్ని దేశం గుర్తుంచుకుంటుందని హెచ్చరించారు. వివరాల్లోకి వెళితే, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 131 రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం కాగా, ఆ మార్కును అందుకోకపోవడంతో బిల్లు వీగిపోయింది. 2029 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పరిణామంపై ఏపీ సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను రీపోస్ట్ చేస్తూ, మహిళా సాధికారతకు అడ్డుపడిన ప్రతిపక్షాల వైఖరిని ఆయన తప్పుబట్టారు. వారి చర్యల వల్ల దేశం ఒక చారిత్రక అవకాశాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాహుల్ గాంధీకి బిగ్ షాక్

## - ద్వంద్వ పౌరసత్వంపై కేసు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి, విచారణ జరపాలని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని సూచించింది. లేదంటే ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న తన అభ్యర్థనను లక్నోలోని ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు ఈ సంవత్సరం జనవరి 28న తిరస్కరించడంతో, బీజేపీ కార్యకర్త విఘ్నేష్ శిశిర్ అప్పీలు చేశారు. దీంతో అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఈ ఉత్తర్వులు ఇచ్చింది.రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి, కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేష్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్‌గా, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్యస్వామి చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలోనూ తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందని అన్నారు. లేదంటే చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. ఈ అంశంపై సుబ్రహ్మణ్యస్వామి గతంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు.

# పాత మిత్రుల కలయిక

## - ఢిల్లీలో టీడీపీ మిత్రులను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో తాను కలిసి పనిచేసిన పాత మిత్రులను కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రలను పార్లమెంట్ లాబీలో కలిసి కాసేపు ముచ్చటించారు.ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. వీరు నలుగురు గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేశారు. రాష్ట్ర విభజన తదనంతర పరిణామాల నేపథ్యంలో, రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డిలతో సమావేశమైనట్లు పయ్యావుల కేశవ్ 'ఎక్స్' వేదికగా 'పాత మిత్రుల కలయిక' అంటూ పోస్టు పెట్టారు. రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశామని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేసిన నరేందర్ రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588